పారదర్శకత లేని నీటి సంఘ ఎన్నికలు

- ఓటర్ల జాబితా ఎక్కడుందో, ఓట్లు ఉన్నాయో లేదో తెలియదు
- పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాబితా ప్రదర్శన లేదు
- ఎన్నికల షెడ్యూలు తెలియకనే నేడు ఎన్నికలు



ఎన్నికలు నిర్వహించనున్న బి.కొత్తకోట జెడ్పీ బాలికల హైస్కూల్

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో 39 సాగు నీటి సంఘాలకు ప్రభుత్వం శనివారం ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమైంది. అయితే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన అధికారులు గోప్యత ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల షెడ్యూలు నుంచి ఎన్నికల నిర్వహణ వివరాలు, ఓటర్ల జాబితా బహిర్గతం లేదా ప్రభుత్వ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల వద్ద కనీస ప్రదర్శన లేదు. దీనితో నీటి సంఘాల్లో తమ ఓట్లు ఉన్నాయా లేవా అనేది ఓ ఎత్తయితే గోప్యంగా ఎన్నికల నిర్వహణతో అన్నింటిని తమ ఖాతాల్లోకి వేసుకోవాలని అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు.

39 సంఘాలకు ఎన్నికలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండలంలో ఐదు, పెద్దమద్యం మండలంలో ఆరు, పెద్దతిప్పసముద్రం మండలంలో ఏడు, కురబలకోట మండలంలో రెండు, తంబళ్లపల్లె మండలంలో 11, ములకలచెరువు మండలంలో ఎనిమిది నీటి సంఘాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘం పరిధిలోని కొన్ని చెరువులు ఉంటాయి. ఒక్కో సంఘం పరిధిలో ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించారు. ఒక సంఘానికి ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. మొదటి ముగ్గురు సభ్యులు చైర్మన్‌ను, తర్వాతి ముగ్గురు సభ్యులు వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలో 95శాతం మేర ఏకగ్రీవం చేయాలని, కుదరని పక్షంలో చేతులెత్తి ఎన్నుకోవడం లేదంటే రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నిక జరపడం. ఒక్కో చెరువు సంఘ ఎన్నిక కోసం ఒక ఎన్నికల అధికారి, ఒక సహాయ ఎన్నికల అధికారి, పోలింగ్ అధికారి ఉంటారు. శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియ సాయంత్రానికి ముగుస్తుంది.

ఓటర్ల జాబితా ఎక్కడ?

నీటి సంఘాలకు జరిగే ఎన్నికల్లో పాల్గొనేందుకు ఓటర్లయిన రైతులకు సంబంధించిన జాబితాలు ఎక్కడున్నాయో తెలియడం లేదని రైతులు అంటున్నారు. జాబితాల్లో మా పేర్లు ఉన్నాయో లేవో తెలియదని చెబుతున్నారు. జాబితాలను ప్రభుత్వ కార్యాలయాల వద్ద కాని, పోలింగ్ కేంద్రాల వద్ద కాని ప్రదర్శించి ఉంటే ఓటు ఉందా లేదా అని చూసుకోవచ్చు. ఒకవేళ ఓటు లేకపోతే రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో సంబంధిత రైతుల భూ వివరాలు లేనట్టు లెక్క. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఓటర్లను నిర్ణయించారు. దీనితోపాటు జాబితా అందుబాటులో పెట్టకపోవడం వల్ల రైతులు ఈ ఎన్నిక కోసం హాజరయ్యే అవకాశం లేకుండాపోతోంది. దీనితో అధికారపార్టీ నేతలు తమకు అనుకూలంగా ఎన్నికలను నిర్వహించుకునే పరిస్థితి కలుగుతోంది.

సరైన ప్రచారం లేదు

నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రైతుల్లో సరైన ప్రచారం కల్పించలేదు. దీనితో ఎన్నికలపై రైతుల్లో ఆసక్తి కనిపించడం లేదు. రైతుల్లో అవగాహన కల్పించి, ఎన్నికల్లో పాల్గొనేలా చేయడంలో విఫలమయ్యారు. దీనితో ఈ ఎన్నికలు ఏకపక్షంగా జరిగిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఏకగ్రీవం దిశగా సాగునీటి సంఘం ఎన్నికలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని ఏడు ప్రధాన చెరువులకు శనివారం నిర్వహించే అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవం చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. మండలంలో ఏడు చెరువులకు సంబంధించి 5.543 మంది ఆయకట్టు రైతులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే టి.సదుం పంచాయతీలోని తుమ్మల చెరువు మినహా మిగిలిన అన్ని చోట్ల ఏకగ్రీవం కానున్నాయని తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియ ఎంపిక చేసిన గ్రామాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఆయుకట్టదారులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆయుకట్టుదారుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే 9.45 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నిక నిర్వహించనున్నారు. అధికారులు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పత్రికల ద్వారా కూడా కనీస సమాచారం ఇవ్వలేదు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఇరుముడి

కలకడ : అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామికి ఇరుముడి కట్టి శబరిమలకు బయలుదేరారు. శుక్రవారం మండలంలోని అనేక మంది భక్తులు 41రోజులు అయ్యప్పస్వామి మాల ధరించి స్థానిక కామాక్షిసిద్ధేశ్వరస్వామివారి ఆలయంలో ఇరుముడి కట్టుకున్నారు. స్వామి వారి ఇరుముడిలో వేయడానికి కానుకలు కూడా భక్తులు చెల్లించి మాల ధరించిన భక్తులకు అందజేశారు.

దొంతివీధి సచివాలయంలో ఎమ్మెల్యే తనిఖీ

మదనపల్లె : పట్టణంలోని దొంతివీధి సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముగ్గురు సిబ్బంది గైర్హాజరు కావడంతో పాటు, అటెండెన్స్ రిజిష్టర్ లోనూ సంతకాలు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలకు ఫోన్‌చేసి తక్షణమే సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది గైర్హాజరుపై విచారణ జరపాల్సిందిగా ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...ప్రజాసమస్యలపై సచివాలయానికి వచ్చిన వారికి సిబ్బంది అందుబాటులో లేకపోతే, వారు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలన్నారు. సచివాలయాల్లో సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. సచివాలయ విధుల్లో నిర్లక్ష్యం కనపరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, తరచూ నియోజకవర్గంలోని సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ జయంతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం జరిగిన హనుమాన్ జయంతిని కనుల పండుగగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కూడా కల్పించారు.

గుణలక్ష్మికి జ్యోతిష్య శిరోమణి అవార్డు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం దేవతానగర్‌కు చెందిన అనమల గుణలక్ష్మికి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. జ్యోతిష్యశాస్త్రంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు ఎస్ఎస్ అస్ట్రో సెంటర్ డాక్టర్ నరసింహస్వామి అవార్డుకు ఎంపిక చేశారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గుణలక్ష్మి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆస్థాన గాయకుడు రంగాచార్యులు పాల్గొన్నారు. గుణలక్ష్మికి పలువురు అభినందించారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన

బి.కొత్తకోట : కిశోర బాలికల ఆరోగ్యం, పోషణపై సంపూర్ణ అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యమ్మ కోరారు. శుక్రవారం ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలు సంపూర్ణ ఆహారం తీసుకోకుండా రక్తహీనతకు గురవుతున్నారని అన్నారు. దీనివల్ల విద్యకు దూరం అవుతున్నారని, అలాంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి విద్య సాధికారత గురించి తెలపాలన్నారు. కిశోర బాలికల ఆరోగ్యం కోసం పోషణ కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఏపీఎం రాజేశ్వరీ, హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్, సూపర్‌వైజర్ హిజాద్ ప్యారీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రులకు మందులు పంపిణీ

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని పశువైద్యశాఖ ఏడీ సుమిత్ర, మండల పశువైద్యాధికారి సుజశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం మందులు పంపిణీ చేశారు. తంబళ్లపల్లె మండలంలోని ఏడు, పెద్దమండ్యం మండలంలోని మూడు పశువైద్యశాలలకు సాధారణ మందులు వారి కేటాయింపుల మేరకు లైవ్‌స్టాక్ ఆఫీసర్లు కిరణ్, మహేష్ అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చింత కొమ్మ

రామసముద్రం : రామసముద్రం–చెంబకూరు రోడ్డు మార్గంలోని శనిమహాత్మస్వామి ఆలయం వద్ద ఉన్న పెద్ద చింతచెట్టు కొమ్మ శుక్రవారం అకస్మాత్తుగా విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ ప్రయాణించకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్నేళ్లనాటి మహావృక్షం అయిన పెద్ద చింతచెట్టు ప్రమాదవశాత్తు మధ్యలోకి చీలిపోయి రోడ్డుపై విరిగి పడింది. ఈ నేపథ్యంలో రోడ్డుమార్గంలో వాహనరాకపోకలు నిలిచిపోయి ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. వర్షానికి అడ్డదారులు కూడా బురదమయంగా మారడంతో అవస్థలు పడ్డారు. నాలుగు చక్రాల వాహనాలు మినహా ద్విచక్రవాహనాలు అడ్డదారుల్లో అవస్థలు పడ్డారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య చెట్టుకొమ్మను తొలగించి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యంపై దృష్టి

పీలేరు : అధిక వర్షాలు కురుస్తున్న సమయంలో మురుగునీటి నిల్వ వలన విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ మరిన్ని పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతుందని పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యలయంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించి ఆదేశించారు. పారిశుధ్యంపై ప్రజలనుంచి ఫిర్యాదులు అందితే సిబ్బందిపై వేటుతప్పదన్నారు. తాగు నీటి పైప్‌లైన్‌లు ఎక్కడైనా లీకేజీలు ఉన్నా, మంచినీరు కలుషితమవుతున్నా వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. బారీ వర్షాలపట్ల మేజర్ పంచాయతీ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనాథరెడ్డి, విక్టరీ, అబీద్, రమేష్, సాంబశివారెడ్డి, సచిన్, పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మదనపల్లె సిటీ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థాని ఎంఆర్‌సీ కార్యాలయంలో యూటీఎఫ్‌చే రూపొందించబడిన ఎస్ఎస్‌సీ మోడల్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ప్రతి ఏడాది యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ మోడల్ ప్రశ్నాపత్రాలు తయారు చేసి విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పుస్తకాల నుంచి అధిక సంఖ్యలో ప్రశ్నలు రావడం జరుగుతుందన్నారు. అన్ని సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంగా తీసుకురావడం వల్ల విద్యలో వెనుబడిన విద్యార్థులకు మరింత ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రాజగోపాల్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, భాస్కర్‌రెడ్డి, విజయకుమార్, సుధాకర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవితకు 'కిషోర వికాసం'


పీలేరు: ప్రసంగిస్తున్న ఎంపీడీఓ శివశంకర్

పీలేరు : బాలికల ఉజ్వల భవిత కోసం కిషోర వికాసం కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ జి.శివవంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ , ఆరోగ్యసిబ్బందికి ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. బాలికల వికాసం కోసం ప్రభుత్వం అందించే ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిగ్రామంలో కిషోర్ బాలికలకు సరైన విజ్ఞానం అందించి, జీవితంలో అన్ని విధాల ఎదుగుదలకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. మహిళా సాధికారత దిశగా ఆడబిడ్డ వేసే ప్రతిఅడుగుకు అందరం కలిసి కట్టుగా చేయుతనిద్దాం అని పిలుపునిచ్చారు. సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను లింగవివక్ష, అసాంఘిక కార్యక్రమాలు ఆపడం వలన విశేష ఫలితాలు ఉంటాని, బాలికలు పూర్తి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఇది మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి, సీడీపీఓ రాజమ్మ, హెచ్ఈ విజయలక్ష్మి, కొండయ్య, ఏపీఎం జవహర్‌బాష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, స్వరూప, స్వర్ణ, ఉమా, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లింగ వివక్ష నేరం

కలకడ : లింగవివక్ష చట్టరీత్యానేరమని, బాలికల ఉజ్వల భవిత్ కోసమే కిషోర వికాసం కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ, వెలుగు, ఆరోగ్యసిబ్బందికి ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కిషోర బాలికలకు సరైన విజ్ఞానం అందించి, జీవితంలో వారి ఎదుగుదలకు అన్ని విధాల ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. మహిళా సాధికారత దిశగా ఆడబిడ్డవేసే ప్రతి అడుగుకు చేయూతనిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్రనాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, వెలుగు సీసీలు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆడిట్ చేపట్టండి

పెద్దతిప్పసముద్రం : మండలంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి పకడ్బందీగా ఆడిట్ చేపట్టాలని ములకలచెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు తనిఖీ బృందానికి ఆదేశించారు. ఈ నెల 11న సాక్షి పత్రికలో 'ఉపాధిలో అవినీతి ఊడలు' అని ప్రచురితమైన వార్తపై రాష్ట్ర కమిషనర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఏపీడీ శుక్రవారం మండల కేంద్రానికి వచ్చారు. గ్రామాల్లో ఉపాధి ద్వారా జరిగిన అన్ని పనులను క్షుణంగా పరిశీలించి కూలీలు, రైతులతో చర్చించాలని ఆడిట్ బృందానికి సూచించారు. ఉపాధి సిబ్బందితో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని నామమాత్రంగా తనిఖీ చేస్తే సహించేది లేదని బృందానికి హెచ్చరించారు. పనుల తనిఖీ అనంతరం గ్రామసభలు ఎప్పుడు ఎక్కడ జరుగుతాయి అనే వివరాలతో కూడిన షెడ్యూల్ ప్రతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అటించి చాటింపు ద్వారా ప్రజలకు వివరించి సభలు నిర్వహించాలని ఏపీఓ తిరుపాలప్పను ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులో 42 అర్జీలు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి రెవెన్యూ రికార్డుల్లో నమోదు కోసం 37 అర్జీలు, భూ సర్వే కోసం ఒకటి, దారిసమస్య పరిష్కారం కోసం రెండు, కోసువారిపల్లెకు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు.అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీదారులకు రసీదులు ఇచ్చినట్లు తెలిపారు. అర్జీలు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పర్యటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

పీలేరు రూరల్: అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించే విధంగా పర్యటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సబిత విశ్వవిద్యాలయం–చెన్నై ఆచార్య మిల్టన్ అన్నారు. శుక్రవారం స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పర్యాటకంపై ఔత్సాహికులు, ప్రకృతి ప్రేమికులు పెరిగారని దానిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు పర్యటక విధానాలను రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరుకు చెందిన సిటీ విశ్వవిద్యాలయం డాక్టర్ సుమితకుమార్‌సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో పర్యటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు, అధ్యయనాలు జరుగుతున్నాయని తెలిపారు.

అన్నదాతలకు బాసటగా వైఎస్సార్ సీపీ

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


అన్నదాతకు అండగా నిరసనలో నిసార్‌అహ్మద్, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల

మదనపల్లె : కూటమి ప్రభుత్వంలో దగాకు గురైన అన్నదాతలకు బాసటగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగిన అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి మదనపల్లె నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి నిసార్‌అహ్మద్ తరలి వెళ్లారు. నిరసన కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్నాకు వెళ్లే ముందు మదనపల్లెలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ...కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తి చేసుకున్నా ఇప్పటివరకు రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని మండిపడ్డారు. రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, పెట్టుబడి సాయం ఊసే ఎత్తకుండా మోసం చేస్తోందన్నారు. వరి ధాన్యంను తేమ సాకుగా చూపి కొనుగోలు చేయకుండా రైతుల జీవితాలతో కూటమిప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డకౌట్ అయిందన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇవ్వాల్సిందేనన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 తదితర హామీలన్నీ నెరవేర్చాల్సిందేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత పంటల బీమా పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువస్తే, ఆ ఉచిత పంటల బీమా పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి రైతులపై కూటమి ప్రభుత్వం భారం మోపుతోందన్నారు. రైతుల పక్షాన వైఎస్.జగన్ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, రామసముద్రం జెడ్పీటీసీ సీహెచ్.రామచంద్రారెడ్డి, నాయకులు వెలుగుచంద్ర, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు కేశవరెడ్డి, కొండూరుకృష్ణారెడ్డి, జయరాంరెడ్డి, మునిశేఖర్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


పెద్దపాళెం వీధిలో బ్లీచింగ్ చల్లిస్తున్న అధికారులు

గుర్రంకొండ : గుర్రంకొండ మేజర్ పంచాయతీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం ప్రచురితమైన 'మురుగు ఇలా....పరిశుభ్రత ఎలా?'అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పెద్ద పాళెం వీధిలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల చేత పనులు చేయించారు. వీధి మధ్యలో ప్రవహిస్తున్న మురుగునీరు శుభ్రం చేశారు. పరిసరాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం కుప్పలను తొలగించారు. మురుగు నిల్వ ప్రాంతాల్లో దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో మురుగునీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తామన్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీధుల్లో మురుగునీరు వదలడం వలన జ్వరాలు ప్రబలుతాయన్నారు. క్యార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి నిస్సార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఆరుగురు ఎంపిక

తంబళ్లపల్లె : స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. అమరరాజా కంపెనీ ప్రతినిధి రామ్ ప్రసాద్ హాజరయ్యారు. 15 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. విద్యార్హత, నైపుణ్యం, వయస్సు అంశాలను పరిశీలించి ఆరుగురిని ఎంపిక చేశారు.

జర్నలిస్టులపై దాడి దుర్మార్గం

- దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలి
- దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతి పత్రం అందించి జర్నలిస్టులు


సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

మదనపల్లె : పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులపై దాడిచేయడం దుర్మార్గమని, దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లి అక్కులప్ప డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడికి నిరసనగా శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు, వినతిపత్రం సమర్పించారు. అన్నమయ్య జిల్లా ఏపీయూడబ్ల్యూజే కార్యదర్శి ఎస్.వంశీధర్, మదనపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్‌రాయల్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు వచ్చిన వారు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరచడం దుర్మార్గం అన్నారు. అంతేకాకుండా కెమెరాలను, సెల్‌ఫోన్‌లను లాక్కుని పగలగొట్టారన్నారు. అనంతరం జర్నలిస్టులను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడిచేసిన వారిపై కేసులు పెట్టి వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలన్నారు. జర్నలిస్టులపై దాడులను నియంత్రించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు జీ.వి.శివారెడ్డి, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌గౌడ్, జనంశ్రీనివాసులు, ఆకులకిరణ్‌కుమార్, గుణ, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, ఐన్యూస్ శ్రీనివాసులు, కిరణ్, మాడా చంద్రమోహన్, మంచూరిశ్రీనాథుడు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



పీలేరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు


పెద్దమండ్యం : అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు


మినికి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మదనపల్లె : దీర్ఘకాలంగా, అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మీ భూమి–మీ హక్కు పేరుతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల నోడల్ అధికారి, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పోతబోలు గ్రామంలో సర్పంచ్ ఈశ్వరయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో మండలంలోని అన్ని అధికారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను ఆర్టీజీఎస్ గ్రీవెన్స్ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానంలో నమోదుచేసి, రసీదు అందజేస్తామన్నారు. అర్జీ స్వీకరించిన 45 రోజుల్లోపు సమస్యను పరిష్కరించడం చేస్తామని, ఒకవేళ పరిష్కారం కాని పక్షంలో దానికి కారణాలను తెలియజేస్తూ అర్జీదారుడికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ అస్లాం, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

నిమ్మనపల్లె : రైతుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. శుక్రవారం రాచవేటివారిపల్లె సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ స్థాయిలో అధికారులే నేరుగా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను 45 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. భూమికి సంబంధించిన నిజమైన హక్కుదారులను గుర్తించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించడమే రెవెన్యూ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. స్థానికంగా రైతులు, అధికారులకు సహకరించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల అవగాహన నిమిత్తం రెవెన్యూ సదస్సుల్లో గ్రామపటాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. ఇప్పటివరకు మండలంలోని వెంగంవారిపల్లె, ముష్టూరు, బండ్లపై గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 200లకు పైగా అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారి రమణారెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, ఆర్ఐ అనంతలక్ష్మి, మండల సర్వేయర్ గోపీనాథ్, ఎఫ్‌బీఓ శోభారాణి, మాజీ సర్పంచ్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు అర్జీల వెల్లువ

రామసముద్రం : మండలంలోని మినికి గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలాదేవి అర్జీలు స్వీకరించారు. సదస్సులో పట్టాదారు పాసుపుస్తకం, మ్యుటేషన్, అన్నదమ్ముల తగాదాలు, సర్వేలు, పాసుపుస్తకాలు తదితర వాటిపై 34 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, వీఆర్వోలు మల్లికార్జున, జగదీష్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బండ్రేవులో రెవెన్యూ సదస్సు

పెద్దమండ్యం : మండలంలోని బండ్రేవులో రెవెన్యూ సదస్సును శుక్రవారం అధికారులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి భారతి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుండి అర్జీలను తహశీల్దార్ సయ్యద్ అహ్మద్ స్వీకరించారు. భూముల ఆన్‌లైన్, మ్యుటేషన్, భూముల సర్వే కోసం రైతులు వినతి చేశారు. అలాగే పించన్లు, ఇంటి నిర్మాణం కోసం స్థలం , ఇతర సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ప్రజలు వినతులు ఇచ్చారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తహశీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సభలు

కలకడ : రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పనికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పాల్గొని వివిధ సమస్యలపై రైతులు, గ్రామస్తులు అందించిన ఫిర్యాదులపై దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువులు ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

పీలేరు రూరల్ : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని ప్రత్యేక అధికారి స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమ అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్డిపల్లె లో ని రైతుసేవాకేంద్రంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రసంగించారు. సదస్సులో 29భూ సమస్యలపై దరఖాస్తులు అందాయన్నారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ యం.భీమేశ్వర్‌రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్ఓ యల్లప్ప, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలో 61 వినతులు

కలికిరి : మండలంలోని గుండ్లూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు ప్రజల నుంచి 61 వినతులు వచ్చినట్లు తహసీల్దారు మహేశ్వరిబాయి తెలిపారు. వీటిలో ఎఫ్–లైన్ పిటిషన్‌లకు సంబంధించి 30, రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్)కు సంబంధించి మరో 30 వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా గుండ్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం.689 నందు 2.54 ఎకరాలు, 690 నందు 6.60 ఎకరాలు, 691 నందు 8.64 ఎకరాలు విస్తీర్ణము ఆర్ఎస్ఆర్ నందు మేతబీడు, రస్తాపోరంబోకు గా ప్రజా అవసరాల కోసం ఉండగా కొందరు రియల్టర్లు ఆక్రమించుకుని, రికార్డుల ట్యాంపరింగ్ చేసి అక్రమంగా 1–బి, అడంగల్‌లో నమోదు చేయించుకున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు వినతిపత్రం అందచేశారు.